తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీవారి చెంత తిరుపతి జిల్లా ఎస్పీ బాధ్యతలు



తిరుమల, సెప్టెంబర్ 14(ప్రభాతవార్త)ప్రతినిధి:

తిరుపతి జిల్లా ఎస్పీగా నియామకమైన లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి చెంతసాంప్రదాయంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉదయమే కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఆలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీకి తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేయడం తనకు ఆనందంగా ఉందన్నారు. తిరుపతి జిల్లా భద్రత, ప్రజలకు మరింత పోలీసు సేవలు చేరువచేయడం, సాంకేతికత వినియోగంపై మెరుగైన సేవలందించేదిశగా చూస్తానన్నారు. అనంతరం ఉదయం తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

## భక్తి,త్యాగం మహిళా కృషికి ప్రతీక

### -శ్రీవారి సేవలో లోక్‌సభ స్పీకర్ బిర్లా

తిరుమల, సెప్టెంబర్ 14(ప్రభాతవార్త)ప్రతినిధి:



తిరుమల తిరుపతి పుణ్య క్షేత్రాలు భక్తి,త్యాగం మహిళా కృషికి ప్రతీకలని, అందుకే మహిళలు పిల్లలలను భారత అభివృద్ధి పథంలో ఉంచడా నికి సరైన ప్రదేశమని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా తెలిపారు. తిరుపతిలో తొలిసారిగా జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ సింగ్, ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుతో కలసి ఓంబిర్లా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు.రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# బాలల సంక్షేమమే వికసిత్ భారత్‌కు పునాది

## నారీ శక్తి వందన్ చట్టం - మహిళలకు సముచిత స్థానం : లోకసభ స్పీకర్ ఓం బిర్లా








జ్యోతి ప్రజల్వన చేస్తున్న లోకసభ స్పీకర్ ఓం బిర్లా, చిత్రంలో రాష్ట్ర స్పీకర్, డిప్యూటీ స్పీకర్

తిరుపతిరూరల్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:

మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి, బాలల సంక్షేమమే 2047నాటికి వికసిత్ భారత్ దృష్టి కోణానికి పునాది అని లోకసభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. పార్లమెంట్, రాష్ట్రకేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీల చారిత్రక తొలి జాతీయ సదస్సును తిరుపతిలో ఓం బిర్లా ప్రారంభించారు. రాహుల్ కన్వెన్సన్‌లో 14,15తేదీలలో జరిగే జాతీయ మహిళా సాధికారత సదస్సును జాతీయ గీతం, రాష్ట్ర గీతాలాపన చేసారు. అనంతరం పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ ఉపాధ్యక్షురాలు డి.పురం దేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభపతి రఘురామ కృష్ణంరాజు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశ వులు, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి, ఎ.పి. శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్య దేవరలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసారు. అంతకమునుపు స్పీకర్ ఓం బిర్లాకు స్వాగతం పలికారు. ఈ సదస్సులో ఓం బిర్లా మాట్లా డుతూ భారతదేశం వికసిత్ భారత్‌గా మారాలంటే మహిళా సాధికారత, బాలల సంక్షేమమే పునాది కావాలన్నారు. మన కుమార్తెలు చదువుకుని స్వయం ఆధారితులేతేనే భారతదేశం సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని స్పష్టం చేసారు. ఈ రెండు రోజుల సదస్సు 'వికసిత్ భారత్ కోసం మహిళా ఆధ్వర్యలంలోని అభివృద్ధి' అనే ప్రధాన అంశంతో జరుగుతుందన్నారు. ఇందులో జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ (లింగానుసార అనుకూల బడ్జెట్), కొత్త సాంకేతిక సవాళ్ళను ఎదుర్కొనేందుకు మహిళలకు సాధికారత అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయన్నారు. మహిళల సాధికారత అనేది అనేది ఒకసారి జరిగే కార్యచరణ కాదని, నిరంతర ప్రక్రియ అన్నారు. గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. రాజ్యాంగ సభలో 15మంది మహిళలు పాల్గొని, భారత రాజ్యాంగాన్ని లింగ సమానత్వానికి అనుగుణంగా రూపొందించారన్నారు. గార్గి, అనసూయ, వంటి పండితులు, రాణి రుద్రమాదేవి, రాణి లక్ష్మీబాయి వంటి యోధులు నేటి శాస్త్రం, క్రీడలు, సాంకేతికం, రాజకీయ రంగాలలోను మహిళల పాత్రను గర్వంగా గుర్తు చేసారు. నారీశక్తి వందన్ అధినియమం (మహిళలకు శాసనసభలలో రిజర్వేషన్) చారిత్రాత్మక చట్టంగా పేర్కొన్నారు. రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు టెక్నాలజీ హబ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్‌లో చేస్తున్న కృషి ప్రశంసనాయమన్నారు. మహిళా స్వశక్తీకరణ కోసం ప్రభుత్వ పథకాల ద్వారా సాధించిన పురోగతిని వివరించారు. స్వర్గీయ ఎన్‌టి రామారావు సేవలు ఆధ్ర మట్టికి గౌరవం అని పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన సదస్సులో మహిళా స్వశక్తికరణపై లోతైన చర్చలకు ముఖ్యవేదికగా నిలించిందన్నారు. భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ పురం దేశ్వరి మాట్లాడుతూ 2047నాటికి వికసిత్ భారత్ యొక్క లక్ష్యాలను సాధించడంలో సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని తెలిపారు.

సర్ణాంధ్ర-2047 సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, నాయకత్వం ముఖ్యమని, సంక్షేమం, శక్తీకరణ కలిసిన రోడ్‌మ్యాప్‌తో రాష్ట్రం ముందుకు వెళ్ళుతుందన్నారు. రాష్ట్రంలో సూపర్‌సిక్స్ ఫ్లాగ్‌షిప్ పథకాలలో భాగంగా తల్లికి వందనం, దీపం2, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు పెన్సన్స్, ప్రసూతి సాయం, రైతు కేంద్రీత ప్రయోజనాలు మహిళలకు మేలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారం, పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ ఛైర్మెన్ గౌరు చరితారెడ్డి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు తదితరులు అభినందనలు తెలిపారు.సాధికారత సదస్సు తిరుపతిలో జరగడం అదృష్టంగా భావిస్తు న్నట్లు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధి కోసం తీర్మానాలు చేసి, ముందుకు నడిపించే శక్తిగా మారాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరంలో రాజ్యాంగ నిర్మాణంలో మహిళ కీలక పాత్రను గుర్తు చేస్తూ..దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సేవలు రాజ్యాంగ కర్తగా చేసిన కృషిని స్మరించారు. స్వర్గీయ రామారావు మహిళలకు తండ్రి ఆస్తిలో సగభాగం ఇచ్చే చట్టాన్ని చేసారనే విషయాన్ని గుర్తు చేసారు. ఉద్యోగాల్లో చదువుల్లోను రిజర్వేషన్ కల్పించారని, ప్రతిభాభారతిని స్పీకర్‌గా నియమించిన సంగతిని వివరించారు. తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా ఉపాధి, రాజకీయాల్లో ప్రాతినిధ్యంల పెంచా రని అభినందించారు. రాష్ట్ర మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్దులు సంక్షేమం, సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వయో వృద్దులుల సంక్షేమం కోసం కమిటీ చేస్తున్న కృషిని తెలియజేస్తూ...మరింత మెరుగైన విధానల అమ లకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ కమిటీ 1993 డిసెంబర్ 29న ఏర్పాటు చేయబడిందని, మహిళలు చిన్నారుల సంక్షేమం కోసం హక్కులు, రక్షణ, సాధికారతపై దృష్టి పెట్టిందన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి మహిళా సాధికారత కమిటీలను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీతో కలిపి పవిత్రక్షేత్రమైన తిరుపతిలో సదస్సు నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టం అన్నారు. స్పీకర్ ఓం బిర్లా అలోచనతోనే అద్భుతమైన కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన డెలిగేట్స్, గూడూరు, సూళ్ళూరుపేట, జిడి నెల్లూరు, రాప్తాడు, ఆళ్లగడ్డ, కడప జిల్లాల ఎమ్మెల్యేలు, యాదవ కార్పోరేషన్ ఛైర్మెన్ నరసింహయాదవ్, బ్యూటిఫికేషన్ ఛైర్మెన్ సుగుణమ్మ, తుడ ఛైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మెన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కామధేను వాహనంపై

## అలరించిన విఘ్ననాధుడు





కామధేను వాహనంపై ఊరేగుతున్న పార్వతీ తనయుడు

కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన విఘ్న నాధుడు కామధేనువాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామపురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈకార్యక్రమానికి కాణి పాకం నాయి బ్రాహ్మణ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు పగలు వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వా ములు సా ్వమివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అలంకరించి ప్రత్యేక పూజలతో ధూపధీపనైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో అర్చకస్వాముల పూజలందుకున్న అనంతరం అలంకారభూషితులైన సిద్ధి,బుద్ధి సమేతుడైన గణనాధుడు రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ ́రకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన కామధేనువాహనంపై అధిరోహించి మంగళ వాయి ద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం పురవీధుల్లో ఊరే గుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. ఈసం దర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులు సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్ర మంలో ఈఓ పెంచలకిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్‌లు శ్రీధర్‌బా బు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, చిట్టిబాబు, ఆలయ మాజీ ఛైర్మెన్ మణినాయుడు,సర్పంచ్ శాంతిసాగంరెడ్డి, ఎంపీటీసీ సుధీర్, మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# వెంటనే లాక్ డౌన్‌గా ప్రకటించాలి : సిఐటియు

గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

మండల పరిధిలోని తుంగపాలెంలో ఉన్న కలర్ షైన్ పరిశ్రమలో మిషనరీ దగ్గర అకస్మాత్తుగా పేలుడు సంభవించిన ఘటనపై ఆదివారం గూడూరు సిఐటియు ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం కలర్ షైన్ పరిశ్రమ వద్దకు చేరుకొని పేలుడు ఘటనలో మృతి చెందిన క్షత గాత్రులైన వారికి వెంటనే పరిశ్రమ యాజమాన్యం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కలర్ షైన్ పరిశ్రమలో కార్మికులు పనిచేస్తుండగా శనివారం మధ్యాహ్నం పేలుడు జింక్ పాట్ వద్ద అకస్మాత్తుగా జరిగిన పేలుడు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య కుమార్ (25) అనే వ్యక్తి మృతి చెందడం జరిగింది. ఊరు గాని ఊరికి వచ్చి, ఐరన్ మెటల్ కరిగించే అటువంటి కెమికల్‌లో ప్రమాదవశాత్తు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య కుమార్ ఆ ద్రవంలో పడి ద్రవంగా మారిపోయారన్నారు. ఈ కలర్ షైన్ పరిశ్రమలో సంబంధిత మిషనరీ చెకింగ్ అధికారులచే చెకింగ్ చేయక పోవడం, మిషనరీ అరుగుదలను, నాసిరకం పైపులు వంటి ప్రధాన లోపాలను, గుర్తించకపోవడం వంటి కారణాలు చేత ఈ పేలుడు ఘటన సంభవించడం జరిగిందన్నారు.మృతుని భార్యా పిల్లలు కుటుంబానికి కోటి రూపాయలు అందచేయాలని అలాగే కళ్ళు, కాళ్లు చేతులు పోగొట్టుకున్న వాళ్ళకి 50 లక్షలు, 25 లక్షలు లెక్కన ఆర్థిక సహాయం అందజేయాలని వారికి గాయాలు పూర్తి అయినదాకా, హాస్పిటల్ మరియు మెడికల్ ఖర్చులు కలర్ షైన్ పరిశ్రమ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, టి.వెంకటరామిరెడ్డి, బి.వి.రమణయ్య, జోగి శివకుమార్, గుర్రం




రమణయ్య, గండికోట మధు, ఎస్.డి.రఫీ, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య, ఆర్.శ్రీనివాసుల, వెంకటేశ్వర్లు, వి.భాస్కర్ రెడ్డి, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగుంట వద్ద ఘోర రోడ్డుప్రమాదం

## ముగ్గురికి తీవ్ర గాయాలు

రేణిగుంట సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై రేణిగుంట మండలం మర్రిగుంట వద్ద శనివారం మధ్యాహ్నంలారీని కోళ్ల లోడుతో ఉన్న ఈచర్ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా శ్రీకాళహస్తి వైపు నుండి గాజులమండ్యం వైపు వెళుతున్న లారీని వెనుక వైపు కోళ్ల లోడుతో వెళుతున్న ఈచర్ వ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాను ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. విషయం తెలుసుకున్న వెంటనే రూరల్ రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, ఎస్సై సుధాకర్ ఆదేశాలతో గాజులమండ్యం పోలీసులు ఫుటాహుటిన సంఘటనా స్థలం చేరుకున్నారు. వ్యాను ముందు భాగంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, సహాయకులు విక్రం, సురేంద్రలు విపరీతమైన గాయాలతో ఇరుక్కుపోయారు. సమయస్ఫూర్తి ప్రదర్శించి కానిస్టేబుల్ మణి వ్యాను ముందు భాగమైన క్యాబిన్ కు తాడు కట్టి వేరొక లారీతో గట్టిగా లాగించడం వల్ల అందులో చిక్కుకున్న క్షతగాత్రులను అతి కష్టం మీద బయటకు తీశారు. వెంటనే వారిని 108 అంబులెన్స్లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. సమయస్ఫూర్తి ప్రదర్శించి క్షతగాత్రులను కాపాడిన కానిస్టేబుల్ మణిని స్థానికులు అభినందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వ్యాన్లో చిక్కుకున్న క్షతగాత్రులు వెలుపలికి తీస్తున్న దృశ్యం.

### ఆ నలుగురి మిస్టరీ మరణాలపై

## పోలీసు దర్యాప్తు

### గాదంకి టోల్‌ప్లాజా సమీప అటవీ ప్రాంతంలో దుర్ఘటన

చంద్రగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

తల్లితండ్రి సహా ఇద్దరు పిల్లల మిస్టరీ మరణాలపై చంద్రగిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మండల పరిధిలోని టోల్‌ప్లాజాకు సమీపంలో చెట్టుకు వ్రేలాడుతున్న గుర్తుపట్టలేని స్థితిలోని రెండు మృతదేహాలతో పాటు పూడ్చిపెట్టిన మరో ఇద్దరు పిల్లల మృతదేహాలను ఆలస్యంగా గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న చ ంద్రగిరి-పాకాల పోలీసులు ముందుగా సంఘటనా స్థలం ఎవరి పరిధిలోకి వస్తుందనే విషయంలో కొంత సందిగ్ధత ఏర్పడింది. ఇక్కడికి చేరుకున్న పోలీ సులు చర్చించుకుని ఆపై చంద్రగిరి పోలీసులు కేసు తీసుకున్నారు. కుటుం బంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డారా, మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**-ప్రశాంత్ నగర్ చోరీ**

చంద్రగిరి ప్రశాంత్ నగర్‌లోని ఓ నివాసంలో దొంగలుపడి అందినంత దోచుకుపోయారు. బాధితుడి నివాసంలో సుమారు 50 సవర్లు బంగారు, 1 కేజీ వెండి, రూ.5 లక్షలు నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కాంతులీనుతున్న చంద్రగిరి మహల్

## ఆతిథ్యం అద్భుతం .. అలరించిన సాంస్కృతికం

### రాయలవారి కోటలో గౌరవ అతిథులు



చంద్రగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటలో అద్భుతమైన ఆతిథ్యం లభించిందని పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లా, ఇతర అతిథులు అభినందనలు తెలియజేశారు. చంద్రగిరి కోటలో సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన డెలిగేట్లకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఆతి థ్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి కోట విశేషాలను తెలుపు సౌండ్ అండ్ లైట్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు సభ్యుల కొరకు ప్రదర్శించారు. అనంతరం రుచికరమైన వంటలతో ఆతిథ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పార్లమెంటరీ మహిళా సాధికా రత కమిటీ అధ్యక్షురాలు డి. పురందేశ్వరి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ సి.అయ్యన్నపాత్రుడు,ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవరలకు జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్,,జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఘనస్వాగతం పలికారు. విచ్చేసిన అతిధులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులు సాదరంగా ఆహ్వానించారు.





# స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ సాధిస్తాం

– ప్రభుత్వ విప్
డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ సాధిస్తుందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో గరిగచీనేపల్లి వైస్ సర్ప ంచ్ మురుగన్, పెరిత ఓబి, కుమరేష్, ఏసురాజ్, సెల్వం, సామిడి, ప్రభు, ప్రశాంత్, శంకర్ మేస్త్రి, గణేష్, సత్యమణి తదితరులు వైకాపాను



వీడి తెదేపాలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదర ంగా నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ కంచర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలందరూ కలసి ముందుకు వచ్చి కూటమి ప్రభుత్వాన్ని మరింత ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కడ సభ్యులు రాజ్‌కుమార్, రామచంద్ర, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌కన్నన్, నేతలు సంజీవి, డీలర్ వెంకటేష్, మోహన్, చంద్ర, హైదర్ వలీ, నరసింహులు, పుల్లయ్య, శశికుమార్, ఎవి రవి, బగ్గిడి వెంకటేష్,బంగారు పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న జిల్లా నూతన ఎస్పీ

కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



జిల్లా నూతన ఎస్పీ తుషార్ దూడి ఆదివారం రాత్రి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్ కోదండపాణి,డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అప్పట్లో అలా.. కానిచ్చేశారు !!

– కుప్పం మున్సిపాలిటీ రూపు మారేనా..?
– హేతుబద్ధంగా సాగని పంచాయతీల విలీనాలు.. పురపాలికలో అటవీ సరిహద్దు గ్రామాలు !!

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కుప్పంను మున్సిపాలిటీగా మార్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం అప్పట్లో మున్సిపాలిటీలో చేరే పంచాయతీల అంశంగా హేతుబద్ధతను పరిశీలించక ఆదరా బాదరా కానిచ్చేశారు. దీంతో కుప్పం మున్సిపాలిటీగా ఏర్పాటైనా మున్సిపాలిటీ పరిధిలో అటవీ సమీప గ్రామాలు సైతం ప్రస్తుతం కొనసాగుతుండడం గమనార్హం. అప్పట్లో కుప్పం గ్రామ పంచాయతీతో పాటు చీమనాయనపల్లి, సామగుట్టపల్లి, కమతమూరు, అనిమిగానిపల్లి, తంబిగానిపల్లి, చీలేపల్లి,డికెపల్లి పంచాయతీలను విలీనం చేస్తూ కుప్పం మున్సిపాలిటీగా 2020లో ఏర్పాటుచేశారు. వీటిలో సామగుట్టపల్లి పంచాయతీలో గతంలో ఉన్న నారాయణపురం గ్రామం సైతం ప్రస్తుతం మున్సిపాలిటీలో కొనసాగుతోంది. ఈ గ్రామం కుప్పానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో కంగుంది రిజర్వ్ ఫారెస్ట్‌కు సమీపంలో ఉంది. అలాగే చీలేపల్లి పంచాయతీలోని పరమసముద్రం గ్రామం సైతం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ తరహా గ్రామాలను మున్సిపాలిటీలో చేర్చేశారు. కుప్పం పట్టణంకు కూతవేటు దూరంలో ఉన్న గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీని, కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బెగ్గిలపల్లి పంచాయతీలను వదిలేశారు.

***మున్సిపాలిటీకి ఆదాయం అంతంతే :*** గతంలో పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో పెద్దగా పన్నుల వసూళ్ల ఉండేవి కావు. ఆయా పంచాయతీల సర్పంచులు అవసరం ఉంటే తప్ప గ్రామాల్లో పన్నుల వసూళ్లకు ప్రయత్నించేవారు కాదు. మున్సిపాలిటీలో విలీనం అయిన పంచాయతీలు అన్నీ దాదాపు మైనర్ పంచాయతీలే. మున్సిపాలిటీకి ప్రస్తుతం ప్రధాన పన్నుల ఆదాయం కుప్పం పట్టణం నుంచే వస్తోంది. గ్రామాలనుంచి పెద్దగా పన్నుల ఆదాయం లేదనే చెప్పాలి. కాగా కుప్పం పట్టణ ప్రాంత విస్తీర్ణంతో పాటు జనాభా పెరుగుతోంది. దీ ంతో పాటు పట్టణానికి దగ్గరలో ఉన్న బెగ్గిలపల్లి తదితర పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసి ప్రస్తుతం కొనసాగుతున్న దూర ప్రాంత గ్రామాలను తొలగిస్తే మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సైతం పెరిగే అవకాశాలు ఉంటాయి.

2027లో మార్పులకు అవకాశం : మున్సిపాలిటీల పరిధిలో మార్పులు, చేర్పులు చేయాల ంటే 2027లో కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని తెలిసింది. అప్పటికి దేశవ్యాప్తంగా జనగణన పూర్తవుతుంది. తదనంతరం మున్సిపాలిటీల విభజన, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని సమాచారం. కాగా ఇప్పటికే కుప్పం మున్సిపాలిటీలో మార్పులు, చేర్పులపై ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిసింది. ఏది ఏమైనా ముమ్ముందు కుప్పం మున్సిపాలిటీ రూపురేఖలు మారుతాయోమో వేచి చూడాలి.

## బాల్య వివాహాల రహిత ప్రపంచాన్ని సృష్టించుకుందాం:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త




యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్స్ ప్రాజెక్టు, ప్రగతి సంస్థ సారధ్యంలోశ్రీకాళహస్తిలోని పూసల వీధిలో గల మసీదులో మసీదు కమిటి అధ్యక్షలు షానవాజ్ అధ్యక్షతన బాల్యవివాహాల రహిత ప్రపంచాన్ని సృష్టించుకుందామని ప్రతిజ్ఞ చేసారు.3 రోజుల పాటు నిర్వహించిన చైతన్య సమావేశాలు,సభలు,అవగాహన సదస్సులు ఆదివారం ముగిసాయి. చివరి సమావేశం మసీదులో నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రగతి సంస్థ కో ఆర్డినేటర్ రాజారెడ్డి మాట్లాడుతూ సమాజంలో బాల్యవివాహాలు అనేది ఓ దురాచారం అన్నారు. దీని వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నా కొందరు తల్లిదండ్రులు స్పందించటం లేదని వివరించారు. వివాహాలకు వేదికలైన దేవాలయాలు,మసీదులు, చర్చిల్లో బాల్యవివాహాలపై అవగాహన కల్పించుటకు ప్రయత్నించామన్నారు. ఈ నేపథ్యంలో పురోహితులు, ఖాజీ, హజరత్‌లు,ఇమాంలు ద్వారా సమాజానికి పిలుపు నివ్వటానికి చర్చించినట్లు వివరించారు. ఈమేరకు కార్యక్రమాల్లో అధ్యక్షులు షానవాజ్, లాలు బాషా, షబ్బీర్, ఉస్మాన్, మౌలాలి, అబ్దుల్లా, పాస్టర్ అంద్రోస్, ప్రఫైల్, డేనియల్,లూకా సోషల్ యాక్టివిస్ట్ గోవర్ధన్, ప్రగతి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి, చందమామల కోటయ్య, లత, మోహన్‌బాబులు పాల్గొన్నారు.

## భక్తులకు సంతృప్తికరంగా సౌకర్యాలు

–గ్యాలరీల్లో అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగ కుండా సకల సౌకర్యాలు కల్పిస్తు న్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయు డు తెలిపారు. ఇప్పటికే తిరుమలలో ఏర్పాట్లు దాదాపు పూర్తికావస్తున్నా యన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆదివారం సాయంత్రం టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, విజిలెన్స్ తో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాఢవీధుల్లో తనిఖీ చేశారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

## బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి) సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రం నుంచి కాకుండా కరాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండ భక్తజన సంద్రమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. విఐపిల దాకిడి అధికం కావడంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొండ దినాన్ని పురస్కరించుకొని అర్చక, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఇఒ, ఉపకమీషనర్ భక్తులకు మౌళిక వసతులు కల్పించారు. అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకుల సేవలో నిమగ్నమయ్యారు.

## బోయకొండ కార్మికులకు జీతాలు సకాలంలో అందించాలి : సిఐటియు

చౌడేపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండలో పనిచేస్తున్న ఒప్పందకార్మికులకు జీతాలను సకాలంలో అందించాలని సిఐటియు జిల్లా నాయకుడు వాడ గంగరాజు డిమాండ్ చేసారు. కొండపై చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు సగం నెల అవుతున్నా జీతాలు అందించకపోవడం విడ్డూరంగా వుందన్నారు. జీతాలపై ఆధారపడి జీవించే కుటుంబాలకు సకాలం జీతాలందించక పోవడం వల్ల వారి ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ఆలయ అధికారులు దాటవేసే సమాధానాలు చెబుతున్నారనీ, సకాలంలో అందించి వారికి తోడ్పాటు ఇవ్వాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బోయకొండకు కాలి నడకన భక్తులు

చౌడేపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ దర్శనార్థం భక్తులు కాలినడకన వచ్చా రు. గంగవరం మండలం పత్తికొండకు చెందిన దాదాపు 30మంది భక్తులు అమ్మవారి దర్శించుకొనేందుకు కాలినడకన వచ్చారు. సాధారణంగా తిరుపతికి భక్తులు కాలినడకన వెళుతుంటారు. అయితే నూతనంగా అమ్మవారి దర్శనానికి దాదాపు వంద కిలోమీటర్లు నడుచుకొని రావడం ఆలయ చరిత్రలో ఇదే ప్రథమం. కాలినడకన వచ్చి దర్శించుకొంటామని అమ్మవారికి మొక్కుకున్నామనీ, అనుకున్న సమయానికి చేరుకొంటున్నామని పత్తికొండ భక్తులన్నారు.

## జడివానతో నేలకూలిన పేదోడి గూడు...!

చౌడేపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



రెండు రోజులుగా మండలంలో రాత్రి సమయంలో కురుస్తున్న జడ వానకు పేదవాడు తలదా చుకొన్న గూడు నేలమట్టమైంది. మండలంలోని పరికిదొన పంచాయతీ మడుకూరుకు చెందిన మునస్వామి కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో అతనికి ఒక ఇళ్ళు వుంది. గత రెండు రోజులుగా రాత్రి వేళల్లో జడివాన కురుస్తోంది. దీంతో మునస్వామి ఇళ్ళు ఒకవైపు వున్న గోడ కూలిపోవడంతో ఇళ్ళంతా నేలమట్టమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిళ్ళలేదు. ఇళ్ళుకూలిపోయి వీధిన పడ్డ బాధితున్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాణిపాకంలో నేడు (సోమవారం)

పగలు : అభిషేకం ,రాత్రి : పూలంగిసేవ

**ఉభయదారులు :** కీ॥శే॥ రాజమాణిక్యం నాయుడు అండ్ సన్స్, వేలూరు, శ్రీ కె.రాధాకృష్ణన్, కాణిపాకం.

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ధార్మికోపాన్యాసము, భక్తిగీతాలు,హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, సురభి వారిచే పౌరాణిక నాటకం, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే విచిత్ర వేషధారణలు, కోలాటాలు, చెక్కభజనలు.

## శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సుధీర్‌చే ఉచిత వైద్య శిబిరం




కుప్పం సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

గుడిపల్లి మండలం తలి అగ్రహారం గ్రామంలో ఆదివారం కుప్పం శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం నందు 350 పైగా ప్రజలు ఆరోగ్యాన్ని పరీక్షించు కోవడం జరిగింది .అదేవిధంగా పై చికిత్సల కోసం డా వెంకటేశ్వర్లు, డా లక్ష్మీ , డా. సౌరబ్ కుల్కర్ణి , డా. సుబ్బారెడ్డి ,డా. ప్రశాంత్ , డా. సూ ర్య , వైద్య బృందం ఓయన్ కొత్తూరు పంచాయతీ ప్రజలే కాకుండా చుట్టుపక్కన ఉన్న తమిళనాడు రాష్ట్రం ప్రజలు కూడా ఈ వైద్య శిబిరంలో పాల్గొని వివిధ పరీక్షలు చూపించుకుని తగిన మందులు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు ,బిజెపి అధ్యక్షుడు రామచంద్రుడు , ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాసులు నాయుడు సత్య అప్ప నాయుడు , దేవరాజు ,లోకేష్ నాయుడు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సదుం సెప్టెంబర్ 14 ప్రభాత వార్త



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనం గా నిర్వహించారు. వృత్తి, జీవనం రీత్యా పలు ప్రాంతాలలో స్థిరపడిన వారు 36 సంవత్సరాల అనంతరం మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. ఒకరిని ఒకరు పలకరించుకుని, ఇన్నాళ్ల అందుబాటులో లేని వారి వివరాలను తెలుసుకున్నారు. తరచూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూజించి, సమావేశంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

## నేడు ఎస్పీ తుషార్ దూది బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

నూతనంగా ఎస్పీగా నియమితులైన తుషార్ దూది సోమవారం ఉదయం 9.20 గంటలకు ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టనన్నారు. ఇది వరకు ఎస్పీగా విధులు నిర్వర్తించిన మణికంఠ చందోలును ప్రభుత్వం బదిలీ చేసి జిల్లా ఎస్పీగా తుషార్ దూదిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## నేడు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పోలీసు అధికారులు పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కమార్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

– కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను నేడు అనివార్య కారణాలచేత రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు..పరికరాలు పంపిణీ

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలతో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద దివ్యాంగులకు ప్రభుత్వం, ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ట్రైసైకిళ్ళ, వినికిడి యంత్రాలు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడ సభ్యులు రాజ్‌కుమార్,వెంకీ, సతీష్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జగన్, రెస్కో డైరెక్టర్ శివ, నేతలు శ్యాంసుందర్, నారాయణ, విష్ణు, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఐఐసి డైరెక్టర్‌గా ప్రేమ్‌కుమార్

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా కుప్పంకు చెందిన సీనియర్ నేత మల్లానూరు ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం టిడిపి కుప్పం మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పార్టీకి ఈయన చేసిన సేవలను గుర్తించిన సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయి పదవి అప్పగించారు. ఆదివారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబులు మల్లానూరు ప్రేమ్‌కుమార్‌ను ఘన ంగా సత్కరించారు. అలాగే పార్టీ కార్యాలయంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, నేతలు వల్లెప్ప, చెక్కునత్తం మణి, రమేష్, సతీష్,సంతోష్, మురళి, శివ, వేణుగోపాల్ తదితరులు ప్రేమ్‌కుమార్‌ను సత్కరించారు.

## వి.కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం

– ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

వి.కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



మండలంలోని పురాతన ఆలయాలను అభి వృద్ధి చేస్తూ వి.కోటను పర్యాటక ప్రాం తంగా మలచుతామని ఎమ్మెల్యే అమరనా థ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇఆదివారం నాయకనేరి అటవీ ప్రాంతంలోని శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ చౌడేశ్వరమ్మ ఆలయాల్లో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర భంగా ఆలయాల వద్ద ఉన్న పురాతన కట్టడాలు పరిశీలించారు. ఈసందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి చల్లని కృప ప్రజలపై ఉండాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్‌గౌడ్, సోమశేఖర్, ధీరజ్, శబరీష్, విశ్వనాథ్, భక్త, ఉదయ్, చందు, సతీష్ పాల్గొన్నారు.

## గణనాధునికి సాంస్కతిక నీరాజనం

కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం జరిగిన కామధేను వాహనం సందర్భంగా స్థానిక ఆస్థాన మండపం లో దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆద్వర్యంలో రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం నుండి రాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు దార్మికోపన్యాసము, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శన, ప్రధాన ఆలయంలో నాయి బ్రాహ్మణ వంశస్థుల నాదస్వర సంగీత కచ్చేరి, కోలాటాలు, చెక్కభజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి.ముఖ్యంగా సురభివారి నాటక ప్రదర్శనలు ఆహుతులను రంజింపజేశాయి.

# కుక్కల కట్టడికి ప్రత్యేక చర్యలు

– 6 నెలల్లో 400 కుక్కలకు శస్త్ర చికిత్సలు, యాంటీ రెబిస్ టీకాలు



చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కలను కట్టడి చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు నగర పరిధిలో శునకాలను కట్టడి చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వాహనల షెడ్‌లో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. పశు సంవర్ధకశాఖ వైద్య బృందం ఇక్కడికి తీసుకు వస్తున్న శునకాలకు శస్త్ర చికిత్సలు చేసి శస్త్ర చికిత్స అనంతరం యాంటీ రెబిస్ టీకా వేసి మూడు రోజుల పాటు ప్రత్యేక షెడ్‌లో వుంచి ఆహారం అందిస్తున్నారు. కుక్కల ఆరోగ్య పరిస్థితి మెరుగైన అనంతరం వాటిని తిరిగి యథాస్థానంలో వదలిపెడుతున్నారు. 2025 ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు 400 శునకాలకు శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగిందని ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ పేర్కొన్నారు. ఇందులో 190 మగ కుక్కలు, 210 ఆడ కుక్కలు వున్నాయన్నారు. నగర పరిధిలోని అన్ని డివిజన్ల నుండి ప్రాధాన్యత క్రమంలో వీధి శునకాలను పట్టి శస్త్ర చికిత్సలు, యాంటీ రెబిస్ వాక్సిన్లు వేయిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. పిచ్చి కుక్కల విషయంలో సిబ్బంది వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

తిరుపతి విద్య, సెప్టెంబర్ 14 ప్రభాత వార్త:



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఆదివారం ఏపి గవర్నమెంట్ పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ పాషా కలిసి తమ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని వినతి పత్రం అందించారు. సిపిఎస్ ఉద్యోగులకు డిఏ బకాయిలు, ఇతర ప్రయోజనాలు వెంటనే విడుదల చేసేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారని మహమ్మద్ పాషా తెలిపారు.

## గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 14 ప్రభాత వార్త:



తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం ఉదయం సంప్రదాయబద్ధంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న పాలకమండలి సభ్యులు అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రమాణం చేశారు. దేవాదాయ శాఖ చట్టం 1987 ప్రకారం అధికారులు సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేశారు. 11 మంది సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులు పూజారి మురళీ స్వామి సహా ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ నేతృత్వంలో మంచి ముహూర్తం కావడంతో ఉదయం 8 గంటల నుంచి 8.20 గంటల మధ్య సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైయ్యారు. అలాగే శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పులుగోరు మురళీ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజాభివృద్ధిలో దేశాభివృద్ధిలో భాగస్వాములను చేసేది ఉపాధ్యాయులు మాత్రమేనని తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ మాట్లాడుతూ దేశ స్థితిగతులను మార్చి శక్తి విద్యార్థులకు ఉందని అలాంటి విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. నేడు ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొందుతున్న ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీఈవో కుమార్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, ప్రవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు తమ్మినేని వెంకటేశ్వర్లు, జనార్దన్ రెడ్డి, రమణారెడ్డి, వాసు, విశ్వనాథరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి ద్వారా పేదలకు సాయం

### ఆరుగురికి రూ.8.13 లక్షలు పంపిణీ

పుత్తూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పుత్తూరు మండలం లోని ఆరుగురు బాధితులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ రూ. 8,13,040 లక్షలను ఆదివారం చెక్కుల రూపేణా పంపిణీ చేశారు. తడుకు గ్రామానికి చెందిన కె.బాలయ్యకు రూ. 96,185 వేలు, తొరూరుకు చెందిన డి.పూజితకు రూ. 1,59,000 లక్షలు, పరమేశ్వరమంగళం జానకి రామానాయుడుకు రూ. 1,50,223 లక్షలు, గొల్లపల్లిలోని మునెమ్మకు రూ. 29,584 వేలు, మునిసిపాలిటీ రాచపాలేనికి చెందిన దొరైరాజుకు 1,28,048 లక్షలు అందించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, రూరల్ మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, పరమేశ్వరమంగళం సింగిల్ విండో ఛైర్మన్ మోహనరాజు, తడుకు సర్పంచ్ వెంకటేష్, మగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్టాండులో నగదు బ్యాగు అపహరణ

తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో నిత్యం ప్రయాణీకులు దోపిడికి గురౌతున్నారు. ఎన్ని సంఘటనలు జరుగుతున్నా బస్సులు ఎక్కె సమయంలో ప్రయాణీకుల నుంచి బ్యాగులు ఆపహరణకు గురౌతున్నారు. కానీ ఇక్కడ ఆర్‌టిసి అధికారులు పట్టించుకోరు. పోలీసులు ఇక్కడ నిఘా ఏర్పాటు చేయటం లేదు. ఈ బస్‌స్టేషన్ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఆదివారం ఓ మహిళకు సంబంధించి రూ.3.8లక్షల నగదును బస్సు కోసం నిరీక్షించే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. సంఘటనకు సంబంధించి బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. వివరాలు ఇలా ఉన్నాయి శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంకు చెందిన సునీల అనే మహిళ తమ స్వగ్రామం నెల్లూరుజిల్లా ముత్యాలకూరుకు వెళ్లటానికి ఆటోలో బయలుదేరింది. బస్టాండుకు వచ్చారు. ఆమె బస్టాండుకు వచ్చే వరకు నగదు బ్యాగు ఉంది. నెల్లూరు బస్టాప్ వద్ద రద్దీగా ఉండటంతో ఆమె నెల్లూరు బస్సు ఎక్కుతుండగా ప్రయత్నిస్తుండగా బ్యాగును ఎవరో తస్కరించినట్లు గుర్తించారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. టూటౌన్ ఎస్ఐ పార్ధసారధికి ఫిర్యాదు చేసారు. ఆయన వెంటనే పోలీసు కానిస్టేబుల్స్‌ను బృందాలుగా పంపారు. వారు వెంటనే ఆర్‌టిసి బస్టాండులోని సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించిన సిఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సిసి కెమెరాలను పరిశీలించామని దొంగను త్వరలోనే పట్టుకుంటామని వివరించారు.

## శివయ్యసేవలో బ్యాంక్ ఆఫ్ బరోడా పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి, జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, మరో జనరల్ మేనేజర్ సిఎం త్రిపాఠి శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. వారు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వెంటనే ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం నిర్వహించారు. వారికి ప్రొటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి, బ్యాంక్ ఆఫ్ బరోడా శ్రీకాళహస్తి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి వారి సిబ్బంది స్వాగతం పలికారు.

## జంగమ సంక్షేమ సంఘంకార్యవర్గం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం జంగమ సంక్షేమ సంఘం సమావేశం పట్టణంలోని సంత మైదానంలోని అంకాళమ్మ గుడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. నేడు సమాజంలో జంగమ సామాజిక వర్గం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి పాలకులు చొరవ చూపటం లేదని అసంతృప్తి వ్యక్తం చేసారు. అధ్యక్షులుగా కారణి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా గడ్డం లోకేష్, శివంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వేజ్జ సుబ్బరాయులు, తలమంచి వంగయ్య, మైలాంగం సుబ్రమణ్యం, వేజ్జ నాగభూషణం, తేరు రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా కారణి ఉదయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా రేవూరు శ్రీలక్ష్మి, వేజ్జ చెంగయ్య, కోశాధికారిగా రేవూరు త్యాగకుమార్, తలమంచి ప్రదీప్ కుమార్, కమిటీ సభ్యులుగా వేజ్జ మనోజ్ సాయి, శంకు మణికంఠ, కారణి కార్తీక్, పాలూరు చంద్రబాబు, విభూతి సుమన్, తలమంచి శివకుమార్, పాల్పూరు బాలు, పాలూరుమునిశివకుమార్, వేజ్జ శంకర్, ఈశ్వరాయ శివకుమార్ వేజ్జ గంగాధర్, గుండేటి శివకుమార్, మైలాంగం మురళీకృష్ణ, దండి ముత్యాలయ్య, గంధవల్లి ధనంజయులు పుల్లూరు మహేష్, పాదిలి సులోచన, నాగపల్లి శివయ్య, రేవూరు సంధ్య, మామిడి గజేంద్ర, తేరు మునిచంద్ర, మునుసూరు మురళిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### నేడు గ్రీవెన్స్‌డే రద్దు

శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మడలంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు తహశీల్దార్ జనార్ధన్‌రాజు ఆదివారం వివరించారు. తిరుపతిలో జాతీయ మహిళా సాధికారిక సదస్సు నిర్వహణ ఉన్నందువల్ల రెవెన్యూ అధికారులు అక్కడకు వెళ్లి ఉన్నారని ఈ నేపధ్యంలో రద్దు చేసినట్లు తహశీల్దార్ వివరించారు.

## కేంద్ర మంత్రికి ఘనస్వాగతం పలికిన కోలా

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



బిజెపి రాజకీయ సభల్లో శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద్‌కుమార్ కీలకంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆదివారం విశాఖలో జరిగిన 'సారథ్యం' బహిరంగ సభ ఏర్పాట్లులో రాష్ట్ర పార్టీతోపాటు ఉపాధ్యక్షుడుగా ఉన్న కోలా ఆనంద్‌కుమార్ రాష్ట్ర మంత్రులతో కలసి కృషి చేసారు. అలాగే బహిరంగ సభకు వచ్చిన కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను స్వాగతం పలకటంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, తిరుపతి జిల్లా సామంచి శ్రీనివాస్‌లతో కలసి స్వాగతం పలికారు. పార్టీలో కీలకంగా ఉన్న కోలా ఆనంద్ తన నియోజకవర్గంలో బిజెపి సభ్యత్వంతో జిల్లాలోనే ముందంజలో ఉన్నారు.

## నడిరోడ్డుపై చెత్త కుండీలు

### రాకపోకలకు అంతరాయం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ రబ్బిష్ అంతా పాత పోస్టాపీసు వీధిలోని ఓ కళ్యాణ మండపం పక్కన వేస్తున్నారు. ఒక వైపు వివాహాలు జరిగినపుడు పుల్లాకులు, ప్రతి రోజూ కూరగాయల మార్కెట్‌లో రబ్బిష్‌లను ఇక్కడ పడేస్తున్నారు. మున్సిపాలిటి వారు ఇక్కడ శుభ్రం చేస్తున్నారు. కానీ రాత్రి వేళల్లో ఇక్కడ పశువులు రోడ్డుకడ్డంగా ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక కుళ్ళిన కూరగాయలుపై వాహనాలు నడపటంతో ద్విచక్రవాహనాలు జారి పడుతున్నారు. ఈ సమస్యలు మున్సిపల్ కమిషనర్‌కు తెలియనిది కాదు. ఇక మార్కెట్ వీధిలో ఓ కళ్యాణ మండపానికి పక్కన వీధిలో ఆటోలు పార్కింగ్ చేస్తారు. అలాగే గృహనిర్మాణ వాహనాలను ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దాంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించాల్సి ఉంది. వార్తలు ప్రచురించినపుడు హడావిడి చేయటం తరువాత పట్టించుకోక పోవటంతోసమస్యయథాతథంగా ఉంటుంది. అధికారులు శాశ్వత పరిష్కారాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

## నవరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నవ రాత్రి మహోత్సవాల పోస్టర్లను ఆదివారం ఆలయంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయం ఎదురుగా బొమ్మల కొలును ఏర్పాటు చేస్తామని శాసనసభ్యుడు సుధీర్‌ంరెడ్డికి వివరించారు. అలాగే దసరా మహోత్సవాలను దేవస్థానం దుర్గాంబ కొండ, ముత్యాలమ్మఆలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

**ఉత్సవాల్లో ఏర్పాట్లు ఘనంగా ఉండాలి:**

దసరా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం తరఫున నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి కనకాచలంపై భక్తులకు తగిన సౌకర్యాలు చేపట్టాలన్నారు. ఇక్కడకు మంగళవారం, శుక్రవారం మహిళా భక్తులు అత్యధికంగా వస్తారు కాబట్టి తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే ముత్యాలమ్మగుడిలో అమ్మవారికి ప్రత్యేకాలంకారాలు జరుపుతారు కాబట్టి అక్కడ మహిళా భక్తుల మనోభవాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్, నాగభూషణం యాదవ్, రవి, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ప్రభాకర్‌శర్మ, అర్ధగిరి, తెలుగుదేశం నాయకులు మీడియా ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, చెంచయ్యనాయుడు, పేట బాలాజి, కాసరంరమేష్, కన్నలి ప్రతాప్‌రెడ్డి, మునిరాజయాదవ్, నెమళ్ళూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో అతిధులు

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో ఆదివారం ఓ వైపు భక్తుల తాకిడి మరో వైపు విఐపిల తాకిడి అధికంగా ఉంది. ఈ నేపధ్యంలో వచ్చిన వారికి ఆలయ మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన శాసనసభ్యురాలు జుమ్మాసొలంకి, కాకినాడ ఆర్‌డిఓ మల్లిబాబు, మధ్యప్రదేశ్ అసిస్టెంట్ కలెక్టర్ ప్రద్యూమ్న, లోక్ సభ మీడియాకు చెందిన నిశాంతి కేతు, సాగర్ కులకుర్తిలు కుటుంబసభ్యులతో వచ్చారు. వారికి ఆలయ ప్రకారం వద్ద స్వాగతం పలికారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత ఆలయ మర్యాదలతో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలతో పాటు ప్రసాదాలను అందించారు.

## సాయి చిత్రపటం ఊరేగింపు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని శ్రీరామనగర్ కాలనీలో వెలసిన సాయి సత్సంగసేవా సమితి సారథ్యంలో ఆదివారం సేవా, భజన, గ్రామోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు వేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ల సారథ్యంల సాయి భక్త బృందం పలు సామాజిక, ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలోభజన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అన్నదానాలు జరిపారు. సాయి సామూహిక సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీరామనగర్ కాలనీ నుంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి, తేరువీదుల మీదుగా సాయి చిత్రపటం ఊరేగింపు సాగింది. కాగా రోటరీ క్లబ్ ఆవరణలో చిన్నారుల నృత్యప్రదర్శనలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## శివయ్య సేవలో యూనియర్‌బ్యాంక్ ఆర్థిక అధికారి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆదివారం రాత్రి యూనియన్‌బ్యాంకు ఫైనాన్షియల్ ఆఫీసర్ అవినాష్ వసంత ప్రభు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు సాదరంగా ఆహ్వానించారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఎఇఓ మోహన్, ఎపిఆర్‌ఓ రవి, యూనియన్‌బ్యాంక్ మేనేజర్లు శేఖర్‌రెడ్డి, హరికృష్ణ, మార్కెటింగ్‌మేనేజర్ యోగానంద్ బ్యాంకు సిబ్బంది స్వాగతం పలికారు. వారికి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

### లోకసభ స్పీకర్ ఓం బిర్లాకు

## బ్రహ్మశ్రీ గురూజీ ఘన సన్మానం

రామచంద్రపురం, సెప్టెంబర్ 14 ప్రభాత వార్త:

తిరుపతిలో జరిగిన జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం సాయంత్రం 6 గంటలకు సి రామాపురం గ్రామంలో ఉన్న బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమాన్ని సందర్శించారు. స్పీకర్‌కి పూర్ణకుంభంతో, మంగళమేళంతో సిద్దేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురువానంద గురూజీ బ్రహ్మర్షి గురూజీ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న లక్ష్మీనారాయణ స్వామిని, జైన్ మందిరాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్ ఓం బిర్లాకు బ్రహ్మశ్రీ గురవానంద గురూజీ స్వామి వారి శేష వస్త్రాన్ని బహుకరించి, తీర్థ ప్రసాదాలు అందించి, ఆశీర్వాదించారు. ఆశ్రమ నిర్వాహకులు స్పీకర్ ఓం బిర్లాను శాలువా కప్పి చందన మాలతో సన్మానించి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, ఎస్పై భక్తవత్సలం, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, కొఠారి, సరళ బోత్ర, ఆశిష్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆర్కేగ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు 'అప్పుస్మా బెస్ట్ టీచర్, కరస్పాండ్ అవార్డు'

తిరుపతిరూరల్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:



ఆర్కె గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌కి 'అప్పుస్మా బెస్ట్ టీచర్–బెస్ట్ కరస్పాండెంట్' అవార్డులు అందుకున్నారు. ఆదివారం తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీలోని డిల్లీ పబ్లిక్ స్కూల్లో అప్పుస్మా సమావేశం జరిగింది. బైరాగిపట్టేడలో ఉన్న వీక్షా ది స్కూల్ హెడ్ మిసెస్ ఆర్‌కె.విమల అప్పుస్మా బెస్ట్ టీచర్ అవార్డును, ఆర్‌కె గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఛైర్మెర్ డాక్టర్ ఆర్కే రెడ్డి బెస్ట్ కరస్పాండెంట్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డులను చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, డాక్టర్ మురళీ మోహన్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదగా అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఓ కెవిఎన్ కుమార్, అప్పుస్మా స్టేట్ ప్రెసిడెంట్ తులసి విష్ణు ప్రసాద్, జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వనాథరెడ్డి, నలంద కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి, గేట్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల సిపిఎం రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక...

రేణిగుంట సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



రేణిగుంట సుందరయ్య భవన్‌లో సిపిఎం పార్టీ నేతలు ఆదివారం పార్టీ సీనియర్ నేత దివంగత సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మార్గంలో నడిచి నిజమైన కామ్రేడ్ అనిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సిపిఎం పార్టీ సీనియర్ నేత ఓ.వి.రమణ పిలుపునిచ్చారు. తరువాత జరిగిన మండల రైతు మహాసభలో రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గుణశేఖర్, అధ్యక్షునిగా ముని రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గుణశేఖర్, కోశాధికారిగా చీరాలయ్య, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, గోపి, సహాయ కార్యదర్శిగా మునిరాజా, మాధవి, కమిటీ సభ్యులుగా చంద్ర ,నాగరాజు, ఛాలెంజ్ ,చిట్టెమ్మ, ఈశ్వరయ్య, వెంకటస్వామిలను ఏకగ్రీవంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, అధ్యక్షులు రంగయ్య ల సమక్షంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఓ వి రమణ, రేణిగుంట ఏర్పేడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, పట్టణ కార్యదర్శి ఈశ్వరమ్మ, తారకరామా నగర్ కార్యదర్శి సత్య శ్రీ, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్, రాజశేఖర్, దీప, భారతీ , సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఛైర్మన్ నాయుడును కలసిన నూతన ఎస్పీ



తిరుమల, సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలిశారు. మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు ఎస్పీకి అభినందనలు తెలిపారు.

## పిట్టు స్పోర్ట్స్‌అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడుగా "పడగల సురేష్"

చంద్రగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా చంద్రగిరి శ్రీ చైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయుడు "పడగల సురేష్" ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పురం జిల్లా, పుట్టపర్తిలో ఆదివారం జరిగిన పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సర్వ సభ్య సమావేశంలో ఈ మేరకు ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు. గతంలో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ చైర్మన్‌గా ఆయన క్రీడాకారులకు అందించిన సేవలను పరిగణలోకి తీసుకుని గ్రామీణ సంప్రదాయ క్రీడలకు మరింత ప్రాధాన్యత కల్పించడానికి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిట్టు అసోసియేషన్ పరిధిలో ఏడు పెంకులు, కర్రబిళ్ళ, కుస్తీ పోటీలు వస్తాయని అన్నారు. పిట్టు అసోసియేషన్ మొదటి అధ్యక్షుడుగా తనకు అవకాశం కల్పించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంభ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్ ఘనంగా సన్మానించి, అభినందించారు.

## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ను కలిసిన పిసి రాయులు

తిరుపతి విద్య సెప్టెంబర్ 14 ప్రభాత వార్త:



లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తన అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతిలోని తాజ్ హోటల్ కి విచ్చేసిన ఆయనను కస్తూర్బా గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలవాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పిసి రాయలు ను క్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్‌పై అవగాహన

తిరుపతి విద్య, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్ పై అవగాహన కల్పించేందుకు ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని 2025 నవంబర్ 21 23 తేదీల్లో విజయ వాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్ నందు ఏపీ జి జే ఎఫ్ బి టు బి జువెలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్, రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ శాంతి లాల్ జైన్, తిరుపతి స్టేట్ వైస్ ప్రెసిడెంట్స్ కె.వి. సత్యనారాయణ, ఎస్ జితేంద్ర కుమార్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 26 జిల్లాలలో 70 అసోసియేషన్ల నుండి 350 మంది ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్లు, జనరల్ బాడీ మెంబెర్స్ హాజరవుతారని విజయ్ కుమార్ తెలిపారు.

## దళారుల ఆట కట్టించుటకు అంతరాలయ దర్శన వేళల ఖరారు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల ఆటకట్టించుటకు దేవస్థానం ఇఓ డి.బాపిరెడ్డి చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఈ మేరకు 'అంతరాలయ దర్శన వేళలను'ను ప్రకటించారు. ఇది చూసిన దళారులు, దీనివల్ల అక్రమార్జనపరుల గుండెల్లో ఒక్కసారి గుబులు చోటు చేసుకుంది. అంతరాలయ దర్శనం పేరుతో దళారులు జేబులు నింపుకుంటుండగా దీనిని చూపి ఎందరో తెరచాటుగా దండుకుంటున్న వారు ఖంగు తిన్నారు. ముఖ్యంగా రాహుకాల సమయంలో దర్శనాలకు సంబంధించి అధ్యయనం చేసిన ఇఓ బాపిరెడ్డి ఒక్క అడుగు ముందుకేసి అంతరాలయ దర్శనం సమయాలను నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రద్దీ గా ఉంటే శని, ఆది, సోమవారాల్లోని రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆలయంలో అదే సమయంలో అభిషేకాలుండటంతో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా సిబ్బందిపై తిరగబడకుండా నిర్ణయాలు తీసుకున్నారు. ఆలయ ఆదివారం ప్రకటించిన సమయాలు ఇలా ఉన్నాయి. శనివారం అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8గంటల వరకు, ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సోమవారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8వరకు మాత్రమే అంతరాలయ దర్శనంను అనుమతిస్తారంటూ బహిరంగ ప్రకటన చేసారు. అలాగే మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు అంతరాలయ దర్శనాలకు అనుమతిస్తారంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేసారు. ఈ సమయాల్లోని అంతరాలయ దర్శనాలను అనుమతించాలని సిబ్బందికి ఆదేశాలు జారి చేసారు.

## కలర్ షైన్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: కార్మికుడు మృతికి కారణమైన కలర్ షైన్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలోని తుంగపాలెం గ్రామం కలర్ షైన్ పరిశ్రమలో జరిగినటువంటి ఫర్నస్ బ్లాస్టింగ్‌లో ఒక కార్మికుడు మృతి మరొక కార్మికుడు మృత్యువుతో పోరాడుతూ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడన్నారు. 9 మంది గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇద్దరికీ కళ్ళు పూర్తిగా పోవడం జరిగినది. ఈ సంఘటనను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తుందన్నారు. చనిపోయినటువంటి కార్మికులకు ఎక్స్‌గ్రేషియా కోటి రూపాయలు ఇవ్వాలని పూర్తిగా ఆరోగ్యం దెబ్బతిన్న వారికి 50 లక్షల రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న వారికి 25 లక్షలు రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం ఇన్చార్జి పూల చంద్రశేఖర్, బీసీ విభాగం నాయకులు రావూరి బ్రహ్మయ్య, గుంటమడుగు సుబ్బరామరాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగ నాయకులు రాజేష్, కాంగ్రెస్ పార్టీ చిల్లకూరు మండల ప్రెసిడెంట్ చిల్లకూరు వేమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి



వెంకటగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :తిరుపతి పట్టణంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్ నందు జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు, వివిధ రాష్ట్రాల మహిళా ప్రతినిధులను, తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులను తదితరులను కలిశారు.

## మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరాలు

బాలాయపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమశాఖ ద్వారా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్త్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ శక్తి వంత మైన కుటుంబం) అను సమగ్ర ఆరోగ్య ప్రచార్, సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లియోనా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తారని తెలిపారు. మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం లాంటి అంశాలను ప్రస్తావించడం జరిగించడం జరిగింది.

## నేడు గ్రీవెన్స్ డే రద్దు

వాకాడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: మహిళా సాధికారత పై పార్లమెంటు, శాసన సభ, మండలి కమిటీల మొదటి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నందు వల్ల జిల్లాలోని అన్ని స్థాయిలోని అధికారులు అందుబాటులో లేనందువల్ల ఈ నెల 15వ తేది సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేను రద్దు చేస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీనివాసులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో జరుగు గ్రీవెన్స్ డేను రద్దు చేసారు. అందువల్ల అర్జీదారులు ఎవరు జిల్లా కేంద్రానికి కానీ, మండల కేంద్రాలలోని కార్యాలయాలకు రాకూడదని తెలిపారు.

## వేమారెడ్డికి సంఘీభావం తెలిపిన వైసిపి



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామంలో వేమారెడ్డి కుమారస్వామిరెడ్డిని ఆదివారం పలువురు వైసిపి నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఇటీవల మోమిడి గ్రామంలో జరిగిన ఘర్షణకి సంబంధించిన కేసులో కుమారస్వామిరెడ్డి జైలుకి వెళ్లివచ్చిన విషయం తెల్సిందే. కాగా అసలు సంభందం లేని విషయంలో అన్యాయంగా కుమార స్వామిరెడ్డిని, వాళ్ళ తల్లి అయిన శరదమ్మను ఇరికించారని ఎద్దేవా చేశారు. మాజీమంత్రి కాకణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చిల్లకూరు పోలీసులు, అధికారులు తెలుగుదేశం పార్టీ ఏజంటుగా పనిచేస్తు న్నారని అన్నారు. ప్రభుత్వాలు ఎప్పుడూ ఒకరే ఉండరని, అన్యాయంగా ప్రవర్తించి మీ మీదకి తెచ్చుకోవద్దని ఈ విషయాన్ని అధికారులు అందరూ కూడా తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి,కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మెరిగ మురళీధర్, మండల మహిళా అధ్యక్షురాలు లలితా రెడ్డి, ఓడూరు శారద,పోలూరు మాధవి, సనత్ రెడ్డి, నందవరం సుబ్బారావు, నక్కా రాజేష్, మనోజ్ రెడ్డి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో వైసీపీ నాయకులు కుమార్ స్వామిరెడ్డిపై అక్రమ కేసు పెట్టారంటూ వారి నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తూ చిల్లకూరు జ్యోతి వే బ్రిడ్జి పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు కుమార్‌స్వామిరెడ్డిపై పెట్టిన కేసులు అక్రమమైనవి కాదని, అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, అవినీతి జరిగిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడే శాసనసభ్యులు సునీల్ కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి నెల్లటూరు చిరంజీవి, పశు గణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గుండాల లీలావతి, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, చిల్లకూరు పిఎసిఎస్ అధ్యక్షులు కొండ రామచంద్రారెడ్డి, బీసీ నాయకులు సతీష్ యాదవ్, మూగ శంకరయ్య, మేకల కుమార్, వెంకట కృష్ణయ్య, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

## వాహన చోదకుని జేబుకు చిల్లు

### - టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు

తొట్టంబేడు,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : అమెరికన్ పార్టీ, వారం రోజుల బాడుగ వస్తుందని ఆశ పడ్డ యజమాని, చెన్నై ఎయిర్ పోర్టుకు వెళ్ళి మోసపోయిన సంఘటన ఆదివారం బాధితుని కథనం మేరకు తెలిసింది. ఉపాధ్యాయనగర్‌లో నివాసముంటున్న హాజీ సుల్తాన్ గోరి అనే ముస్తాఫా కార్లు ఏర్పాటు చేసుకొని ఆయనే బాడుగకు నడుపుకునే వారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఓ రెస్టారెంట్ నిర్వాహకులు చరవాణిలో 'ఓ అమెరికన్ పార్టీ' ఉందని ఓ వారానికి బాడుగకు కావాలని కోరారని సమాచారం అందించారు. అమెరికా నుంచి అంజిరెడ్డి ఆయన సతీమణి కవితలు వస్తారని వారి ఫోన్ నెంబర్ 8123274368 అని పేర్కొన్నారని శుక్రవారం రాత్రి 8గంటలకు సూచించారు. వెంటనే ముస్తాఫా ఆ నెంబర్‌తో మాట్లాడగా వారు తాము అమెరికా నుంచి శనివారం ఉదయం 10.45గంటలకు చెన్నై వస్తామంటూ సమాచారం అందించారు. శనివారం ఉదయం ఆయన చెన్నైలోని విమానాశ్రయానికి సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ పట్టుకొని నిరీక్షించారు. ఉదయం సుమారు 7.45గంటలకు ఫోన్ చేసి తాము న్యూఢిల్లీలో దిగామని చెన్నైకు వస్తామంటూ సమాచారం అందించారు. ఈ మేరకు శనివారం 10.45గంటలకు ఫోన్ చేసి తాము చెన్నై వచ్చేసామని వారం రోజుల పాటు తాము శ్రీకాళహస్తిలోని రెస్టారెంట్‌లో ఉంటామని, కడపజిల్లాలోని రాజంపేటలో 18 ఎకరాల భూములను కొనుగోలు చేసామన్నారు. ఈ భూముల పరిశీలనకు వెళ్ళాల్సి వస్తుందని, మీకు కారు బాడుగను ఇస్తామంటూ వివరించారు. తాము దిగామని, కార్గోలో ఉన్నామని, అయితే కార్గో వారు నగదు రూపంలో ఇస్తామంటే అంగీకరించమని ఫోన్ పే మాత్రమే అంగీకరిస్తామంటూ మొరాయిస్తున్నారని మీ వద్ద ఫోన్‌లో సొమ్ములుంటే వేయాలని కార్గో నిర్వాహకులు అనిల్ కుమార్ అంటూ ఆతని నెంబర్ 9131308209 అంటూ వివరించగా ముస్తాఫా వెంటనే సొమ్ములు ట్రాన్స్‌ఫర్ చేసారు. సొమ్ములు పంపిన వెంటనే అన్ని చరవాణిలు స్విచ్ ఆఫ్ అంటూ బాధితుడు తెలిపారు. ఇలాంటి సైబర్ నేరాలకు చెక్క పెట్టాలని ముస్తాఫా కోరుతున్నారు. ఈ మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

## జడివానలోనే ప్రముఖుల శ్రీవారి దర్శనం



తిరుమల,సెప్టెంబర్14 ప్రభాతవార్త ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం వేకువజాము నుండి ఉదయం 9గంటల వరకు తిరుమలలో జడివాన కురిసింది., వేకువజామున 4గంటలనుండి మోస్తరుగా కురిసిన వాన ఆ తరువాత చిరుజల్లులతో బలంగా పడింది. ఆదివారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రముఖులు, భక్తులు గొడుగులక్రింద సేదదీరారు. అంతేగాక వానలోనే స్వామివారిని దర్శించుకున్నారు. జడివానతో తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లటిగాలులు వీస్తున్నాయి.

# గూడూరు డివిజన్

## దళితులపై ఆగని కూటమి అరాచకాలు : ఎంఎల్‌సి



కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో దళితులపై కూటమి నాయకుల అరాచకాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయని ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆరోపించారు. ఆదివారం కోట మండలం కర్లపూడి గ్రామంలో వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర నివాసంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఇటీవల సురేంద్ర ఇంటి ప్రహారీగోడను కర్లపూడి గ్రామానికి చెందిన కూటమి నాయకులు పుచ్చలపల్లి కృష్ణయ్య, శ్రీనివాసులు, బైనా చిన్నయ్య అక్రమంగా కూల్చేశారని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పేర్నేటి ఆనందరెడ్డి ప్రోత్సాహంతోనే ఇదంతా చేశారని ఆరోపించారు. ఆయన వెంట కోట మండలవైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, నాగరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ రాజారామిరెడ్డి, తన్నమాల కోటారెడ్డి, నాగూర్ యాదవ్, పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, ముంగమూరు సుబ్రహ్మణ్యం యాదవ్, కస్తూరయ్య యాదవ్, కనుపూరు జగదీష్, శశిధర్‌రెడ్డి, శివశంకర్, కర్లపూడి బుజ్జయ్య తదితరులు ఉన్నారు.

## నిస్వార్థ సేవలకు...అరుదైన గౌరవం



చిట్టమూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: హర్యానా రాష్ట్రనికి చెందిన ఎమ్. బి.ఆర్ యూనివర్సిటి 2025 వ సంవత్సరానికి గాను ప్రతిభా, సామాజిక సేవ వంటి విభాగాలలో విశిష్ట వ్యక్తులుకు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డు లను ప్రధానం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఉదయం యూనివర్సిటీ కన్వకేషన్‌హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో నాయుడుపేట 108 అంబులెన్సులో ఏమర్జెన్సీ మెడికల్ టెక్నీషిన్‌గా విధులు నిర్వహిస్తున్న బల్లి కిరణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందించారు. గత 19 సంవత్సరాల నుండి సేవా రంగం అయిన 108 అంబులెన్సులో ఎంతోమంది అత్యవసర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారిని కాపాడారన్నారు. అంతేకాకుండా కిరణ్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బల్లి కిరణ్ సేవలను గుర్తించిన హర్యానా ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ వారు వీరికి ప్రముఖ వ్యక్తులు అయిన గౌరవ సుప్రీం కోర్ట్ సీనియర్ అడ్వకేట్ డాక్టర్ గీతాంజలి శర్మ, మాజీ రాష్ట్రపతి శంకర దయాల్ శర్మ మనమరాలు ప్రముఖ సామాజిక వేత్త శ్రీమతి డాక్టర్ బిందు భార్గవ్, హర్యానా రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజర్ డాక్టర్ రాజ్ పాల్, హర్యానా రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటి అడ్వకేట్ సంధ్యా గుప్తా, హర్యానా రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ కమలేష్ శాస్త్రి, ఎమ్ బి ఆర్ యూనివర్సిటీ సెనిట్ సభ్యులు జి.విజయకుమార్ మరియు ఎమ్‌బిఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సిపి యాదవ్ చేతులు మీదుగా గౌరవ డాక్టరేట్‌ను బల్లి కిరణ్ కుమార్‌కు అందించారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీన గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీ నగర్ ప్రాంతంలోని సమాధుల సమీపంలో జరిగిన హత్య కేసులో నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న రహీద్ భాషా అలియాస్ మున్నా అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన షఫీర్ అలియాస్ అజ్జు అనే ముగ్గురు స్నేహితులన్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి ముగ్గురు కలిసి ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద మద్యం సేవించి అక్కడ నుంచి ఓ మోటారు సైకిల్‌పై ముగ్గురు కలిసి ఓ మద్యం దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేసి తిరిగి టిడ్కో గృహాలకు వస్తున్నారన్నారు. ఈ క్రమంలో రెండో పట్టణ పరిధిలోని ఎస్ఆర్ కళాశాల దాటిన అనంతరం రహీద్ భాషాకు షఫీర్‌కు మధ్య మాటామాటా పెరిగి స్వల్ప వివాదం చోటు చేసుకుందన్నారు. గాంధీనగర్ క్రిస్టియన్ సమాధుల వద్ద మోటారుబైకు నిలిపారు. ఇంతలో మరో నిందితుడు వెంకటేశ్వర్లు కూడా రహీద్ భాషాపై గతంలో తాను సహజీవనం చేస్తున్న వందన అనే మహిళ విషయమై అసభ్యకరంగా మాట్లాడిన విషయాన్ని మనసులో ఉంచుకుని రహీద్ భాషాపై దాడికి పాల్పడ్డారన్నారు. వెంకటేశ్వర్లు అతని వద్ద ఉన్న చాకుతో రహీద్ భాషాను హత్య చేశారన్నారు. అతని బైకును సమీపంలోని సబ్‌స్టేషన్ వెళ్లే రోడ్డు వద్ద ఉంచి యాక్సిడెంట్‌గా చిత్రికరించేందుకు ప్రయత్నించార న్నారు. హత్య చేసిన అనంతరం వెంకటేశ్వర్లు, షఫీర్ అనే ఇద్దరు నిందితులు టిడ్కో గృహాల్లో నివాసముంటున్న వందన అనే మహిళ ఇంటికి వెళ్లగా ఆమె వారికి ఆశ్రయం కల్పించిందన్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం ఈ ముగ్గురు నిందితులు కలిసి చిల్లకూరు మండలం కనుపూరు గ్రామానికి వెళ్లి అక్కడ తల దాచుకుని ఆదివారం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఉండగా వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. దీంతో హత్యకు పాల్పడిన వెంకటేశ్వర్లు, షఫీర్ తోపాటు వీరు తప్పించుకునేందుకు సహకారం అందించిన వందనను అరెస్ట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామేశ్వరరావు, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయండి



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని, అలాగే పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి ఉపాధ్యాయ సంఘాల వారు వినతి పత్రం అందజేశారు. ఐఆర్‌ను సత్వరమే ప్రకటించాలని, హెల్త్‌కార్డుకు సంబంధించి పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, సిసిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ తిరుపతి జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గోపీనాథ్‌రావు, ఉపాధ్యక్షులు ఉస్మాన్‌బాషా, వెంకటరత్నం, సుధాకర్‌రెడ్డి, రమణయ్య, గిరి, సుజన్, సురేష్‌లు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో సాంస్కృతిక పోటీలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, కళాభారత్ వెంకటగిరి వారి ఆధ్వర్యంలో స్థానిక హోలీక్రాస్ హైస్కూలు వేదికగా నిర్వహించిన జానపద సంబరాలు కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. జానపద, శాస్త్రీయ నృత్య కళాకారులు 70 మంది వరకు పాల్గొని తమ కళా రూపాలను ప్రదర్శించి జానపద సంబరాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులందరికీ మెమొంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాన్స్ మాస్టర్ మస్తాన్‌బాబు, నాయుడుపేట డాన్స్ మాస్టర్ జి.డి. చేతులు మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఆలయంలో హుండీ చోరీ

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: మండలంలోని శ్యామసుందరపురంలోని శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి హుండీ చోరీ జరిగింది. ఆలయంలో ప్రధాన తలుపులు తాళాలను ఇనుప రాడ్డుతో పగులగొట్టి అమ్మవారి హుండీని దొంగలు అపహరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయం వద్దకు వచ్చి పరిశీలించారు.

## కోటలో 16 నుంచి 69వ క్రీడా పోటీలు

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: కోటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో 69వ స్కూలు క్రీడా పోటీలు మండల స్థాయిలో జరుగుతాయని ఎంఇఓ మస్తానయ్య తెలిపారు. 16వ తేదీన బాలికలకు, 17, 18 తేదీల్లో బాలురకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఇందులో అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గూడూరు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తారని తెలిపారు.

## వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి




గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సేవకుల సంఘం భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకుల జీతాలు పెంచాలని నైట్ డ్యూటీలు ఆపాలని, నామినీలను వీఆర్‌ఏగా గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 14 మండలాల నుండి 15వ తేదీ సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఆ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మరియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె బంధకి సాహెబ్ పాల్గొంటారని ఆయన తెలిపారు. వీఆర్‌ఏ లందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

## జాతీయ మహిళా సాధికారత సదసు ఎమ్మెల్యే



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: తిరుపతి పట్టణంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్ నందు జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. నియోజకవర్గ సమస్యలను శాసనమండలి స్పీకర్‌కి వివరించారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎంవిఐ అధికారులు



గూడూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: సాధారణ తనిఖీలలో భాగంగా శనివారం సి.సి బస్సులు తనిఖీ చేసి కేసులు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శాంతి, ప్రభాకర్‌లు తెలియ జేశారు. రోడ్డు భద్రత విషయాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లకు అవగాహన కల్పించామని వారు తెలిపారు. జిల్లా కమిషన్, గూడూరు ఆర్.టి.ఓ వారి ఆదేశాల మేరకు శుక్రవారం, శనివారం తనిఖీలలో సుమారు 18 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంవిఐ అధికారులతో పాటు హోంగార్డులు నరేష్, శ్యాము, సుధీర్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు!

నాయుడుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలి ప్రజలు అవస్థలు పడుతున్న సంబంధిత వైత్యఆరోగ్యశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వైద్యం అందించాల్సి అవసరం వుంది. మండలంలోని మర్లపల్లి, అన్నమేడు, కాలవగట్టు, గుణపాటి పాళెం, కల్లిపేడు, కాపులూరు, కూచివాడ, చిలమత్తూరు, మేనకూరు, గొట్టిప్రోలు,తదితర గ్రామాల్లో సీజనల్ వ్యాదులు జ్వరం, జలుబు, దగ్గు, వాంతులు, విరేచనాలు, తలనొప్పి రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లావైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి జ్వరాలను అదుపుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

నాయుడుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: నాయుడుపేట అంబేద్కర్ భవన్‌లో మున్సిపాల్టి చేర్మెన్ కటకం దీపిక అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పజులుల్లా ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈసమావేశంలో తాగునీరు, పారిశుద్యం, డ్రైనేజి తదితర అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించి మున్సిపాల్టి అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈసమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

## సాధికారత సదస్సులో ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: తిరుపతిలో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సులో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. సదస్సు కొచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుని కలిశారు. మహిళా సదస్సు నిర్వహించడం వల్ల అనేక సమస్యలు చర్చించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల అభ్యున్నతికి ఆయన అనేక పథకాలు రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు.

## అక్రమార్కులకు అడ్డాగా వనదుర్గాపురం




పాలసముద్రం,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని వనదుర్గాపురం పచ్చని చెట్లతో అడవుల మధ్యలో సుమారు 1015 ఎకరాల విస్తీర్ణం గల సువిశాలమైన సుందరమైన పంచాయితీ ఇది. ఈ పంచాయతీలో సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టల నుండి గ్రావెల్ తవ్వకాలు జరిపి కోట్లు గడిస్తున్నారు. పంచాయతీలోని పదవి మూల ప్రాంతం నుండి కొన్ని నెలలుగా గ్రావెల్ తవ్వి సుమారు 100 ఎకరాల గుట్టను నేలమట్టం చేశారు. క్వారీ యజమానులు ప్రభుత్వానికి కట్టిన పన్నులు గోరంత వారు దోచుకొన్నది కొండ అంతా, ప్రస్తుతం నేలమట్టమైన గుట్టను ఒక తమిళనాడు వాసి ఆక్రమించుకుని ఉన్నాడు. వన దుర్గాపురం పంచాయతీలో అక్రమాలకు ఒక్క గ్రావెల్ క్వారీ ఏ కాదు రకరకాలుగా అందిన కాడికి అక్రమార్కులు దోచు కొంటున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు ప్రతి పార్టీ నుంచి నాయకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి తమిళనాడు వాసులు ఇచ్చే చిల్లి గవ్వలకు ఆశపడి వారికి ఊడిగం చేస్తూ వారు కోరిన రేషన్ కార్డు, వృద్ధాప్య పెన్షన్, ప్రభుత్వం పేదవారికి ఇచ్చే దరఖాస్తు ( డీకేటి) భూములను వారికి అందించారు. ఇదే పంచాయతీలో నిరంతరం గా ఒక జల్లి క్వారీ నడుస్తున్నది. ప్రస్తుతం ఓడుపు మానుమూల ప్రాంతంలో ఒక గ్రావెల్ క్వారీ ప్రారంభమైనది ఈ పంచాయతీ నుంచి కోట్లలో వ్యాపారం నడుస్తున్న పంచాయతీ అభివృద్ధి మాత్రం శూన్యం. అసలు క్వారీ యజమానులు ప్రభుత్వానికి పన్నులు కడుతున్నారా లేక ప్రభుత్వ నిధులకు గండి కొట్టి అక్రమ వ్యాపారం చేస్తున్నారా తెలియక పంచాయతీ ప్రజలు సతమతమవుతున్నారు. దరఖాస్తు భూములను రద్దు పరిచి పంచాయతీలో అర్హులైన పేదవారికి అందించాలని పంచాయతీ ప్రజలు జిల్లాస్థాయి అధికారులను కోరుకుంటున్నారు.

## గణనాధుని సన్నిధిలో పార్లమెంటరీ పద్దుల కమిటీ



కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: పార్లమెంటరీ పద్దుల కమిటీ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకుంది. ఈమేరకు కమిటీ ఛైర్మన్ శ్రీలక్ష్మీకాంత్ బాజ్పాయ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, యూనియన్ బ్యాంకు మేనేజర్ నవీన్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం సన్నిధిలో డిప్యూటీ స్పీకర్



కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆదివారం రాత్రి కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీ మోహన్, గురుజాల జగన్మోహన్‌లతో కలసి ఆయన స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ జడ్పీటీసీ లత, స్థానిక నాయకులు శేషాద్రినాయుడు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది:**



కాణిపాకం ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం రాత్రి స్వామివారి దర్శనానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 ఏళ్ళ క్రితం అతి చిన్న ఆలయంగా వున్న కాణిపాకం ఆలయం ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సుమారు 18 కోట్లు వెచ్చించిన తమ మిత్రులు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌ల సహకారం మరువలేనిదన్నారు. గత ఆరు నెలల క్రితం స్వామివారి దర స్నార్థం వచ్చిన తాను స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపు మేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఈ ఆలయం సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు.